
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 24 । మే । 2025



సోమశిలలో 44.840 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 44.840 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 3,130, ఉత్తర, దక్షిణ కాలువలకు 250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,940
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,208
నవర (8 గ్రాములు)	రూ.73,664

గరిష్టం/కనిష్టం
39.9 /27.9

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రావణసేవ



విశేషాలంకరణలో స్వామి, అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఉదయం తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రావణ సేవను వేద పండితులు నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవదేవేరులను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లు ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

శాంతిభద్రతలకు పటిష్ట చర్యలు

- ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి



పోలీస్ అధికారుల నుంచి జిల్లా పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న ఐజీ


నెల్లూరు(క్రైమ్): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, నేరస్తులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించొద్దని, వారిపై కఠినంగా వ్యవహరించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జి. కృష్ణకాంత్‌తో కలిసి పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. శాంతి భద్రతలపై ఆరాతీసి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రౌడీషీటర్లు, పాతనేరస్తుల కదలికలపై నిశిత నిఘా ఉంచాలని, యాక్టివ్ రౌడీషీటర్లపై పీడీయాక్టులు నమోదు చేయాలని ఆదేశించారు. మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విధులు ముగించుకొని బైక్‌లో ఇంటికి వెళ్తున్న వ్యక్తిని మరో బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మరణించిన ఘటన మండలంలోని కాగులపాడు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెనుబల్లికి చెందిన ఏడుకొండలు (35) కోవూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్తుండగా కాగులపాడు వద్ద మల్లెతోటలో నుంచి ఓ వ్యక్తి బైక్‌తో సడన్ రోడ్డుపైకి రావడంతో ఏడుకొండలు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఏడుకొండలను నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక దోపిడీ నిర్విఘ్నం

అక్రమ తవ్వకాల ద్వారా డంపింగ్ చేసిన ఇసుక



- డ్రెడ్జింగ్ పేరుతోనే నెట్టుకొస్తున్న అధికార యంత్రాంగం
- అధికారికంగా రెండు చోట్ల.. అనధికారికంగా ముప్పై రీచ్‌లు
- యంత్రాలతో తోడేస్తున్న వైనం
- పెన్నా పొర్లుకట్టలు ధ్వంసం
- పట్టించుకోని మైనింగ్, ఇరిగేషన్ అధికారులు

ఏడాది కాలంగా పర్యావరణ అనుమతి ఊసేలేదు

కోరలు చాచిన ఇసుక మాఫియా పెన్నానదిని కబళించేస్తోంది. ఏడాదిగా ఇసుక దోపిడీ నిర్విఘ్నంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' నుంచి పర్యావరణ అనుమతులు తీసుకోవాలనే ఆలోచనే చేయకుండా తమ పార్టీ నేతలకు దోచిపెడుతోంది. ఎన్‌జీటీకి ప్రతిపాదనలు పంపితే.. ఎక్కడికక్కడ ఇసుక అక్రమ తవ్వకాలకు బ్రేక్ పడుతుందనే దుగ్ధతోనే అడ్డదారిలో అక్రమాలకు పాల్పడుతోంది. డ్రెడ్జింగ్ పేరుతో కాలయాపన చేస్తోంది. అధికారికంగా రెండు చోట్ల డ్రెడ్జింగ్‌కు అనుమతులిస్తే.. అనధికారికంగా ముప్పై రీచ్‌ల నుంచి ఇసుకను తోడేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఇసుక మాఫియాగా అవతరించి.. పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తూ పెన్నానదిని కుళ్లబొడిచేస్తున్నారు. అధికారం అండతో ఆ పార్టీ నేతలు సాగిస్తున్న ఇసుక దోపిడీకి మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖలు తమవంతు సహకారం అందిస్తున్నాయి. ఇసుక కొరతను అధిగమించడానికి 'డ్రెడ్జింగ్' విధానం తాత్కాలికమే.. అయినా ఆ పేరుతో శాశ్వతంగా తవ్వకాలు సాగుతున్నాయి. అత్యవసరం పేరుతో ఏడాది కాలంగా 'డ్రెడ్జింగ్'తో ఇసుక దోపిడీకి మైనింగ్, ఇరిగేషన్ శాఖలు 'పచ్చ కార్పెట్' పరుస్తున్నాయి.



సూరాయపాళెం వద్ద పెన్నానది పాత కరకట్ట ధ్వంసం (ఇన్‌సెట్లో) పెన్నానది మ్యాప్

బ్యారేజీలకు గండం.. జనావాసాలకు పెను ముప్పు

పెన్నానదిపై కొత్తగా నిర్మించిన సంగం, నెల్లూరు బ్యారేజీలకు డ్రెడ్జింగ్ పేరుతో సాగిస్తున్న ఇసుక దోపిడీతో గండం పొంచి ఉందని జలవనరుల నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా నెల్లూరు బ్యారేజీతోపాటు పెన్నానదిపై ఉన్న చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి వంతెనలు దెబ్బతినే ప్రమాదం ఉంటుందంటున్నారు. పెన్నా నదిలో సూరాయపాళెం, పోతిరెడ్డిపాళెం వద్ద అధికార యంత్రాంగం డ్రెడ్జింగ్‌కు అనుమతులిచ్చింది. పోతిరెడ్డిపాళెం వద్ద విచ్చలవిడిగా అనుమతి ఇచ్చిన ఇసుక తవ్వకాలకు మించి వంద రెట్లు ఇసుకను తోడేశారు. ఈ పరిణామంతో నెల్లూరు బ్యారేజీకి ప్రమాదం ముప్పు తప్పేటట్లు లేదు. ఇక భగత్‌సింగ్‌నగర్ ప్రాంతంలోనూ సాగిస్తున్న ఇసుక తవ్వకాలతో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి వంతెన ప్రమాదంలో పడుతుందని చెబుతున్నారు. అదే విధంగా సూరాయపాళెం వద్ద ఇసుక తోడేందుకు ఇచ్చిన అనుమతి కంటే.. ఇప్పటికే మూడొందల రెట్లు ఇసుకను తోడేసినట్లు సమాచారం. ఇక్కడి పరిస్థితులతో సంగం బ్యారేజీకి ప్రమాదఘంటికలు ఉన్నాయని.. ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేసినట్లుగానే జలవనరుల నిపుణులు కూడా అదే జరుగుతుందని విస్పష్టం చేస్తున్నారు. దీంతోపాటు ఎక్కడికక్కడ అనధికార ఇసుక రీచ్‌లు దాదాపు 30 వరకు ఉన్నాయి. నది నుంచి ఇసుకను తరలించేందుకు పెన్నానదిలోకి ఇరువైపులా పొర్లుకట్టలను ధ్వంసం చేసి దర్జాగా రహదారులు ఏర్పాటు చేశారు. తాజాగా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమశిలకు వరద పోటెత్తితే.. అనివార్యంగా పెన్నానదికి వరద నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. అదే జరిగితే పెన్నానది పరీవాహక ప్రాంతాల్లోని జనావాసాలకు పెను ముప్పు తప్పదని జలవనరుల శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

పర్యావరణ హితులు ఎవరైనా 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' తలుపు తట్టితే.. మొట్టమొదటగా అనుమతులిచ్చిన మైనింగ్, ఇరిగేషన్ శాఖలతోపాటు కలెక్టర్ సైతం బోనులో నిలబడాల్సిన పరిస్థితులు ఉన్నాయని న్యాయకోవిదులు చెబుతున్నారు.

మాఫియా ధనార్జనకు క్లెయిం పడుతుందని..

నిబంధనల ప్రకారం పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి పర్యావరణ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇందుకు సంబంధించి మైనింగ్, జలవనరుల శాఖలు ప్రతిపాదించే రీచ్‌లు, అక్కడ పర్యావరణ పరిస్థితులు, ఇసుక నిల్వలపై ఎన్‌జీటీకి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఆ మేరకు అక్కడ ఎంత మేర ఇసుక తవ్వకాలు చేపట్టాలో నిర్ధారిస్తూ ఎన్‌జీటీ అనుమతిస్తోంది. అయితే అధికార పార్టీకి దాసోహం అయిన మైనింగ్, ఇరిగేషన్ శాఖలు ఈ నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఏడాది కాలంగా ఇసుక దోపిడీకి అండగా నిలుస్తున్నాయి. ఇసుక తవ్వకాలకు సంబంధించి ఎన్‌జీటీకి ప్రతిపాదనలు చేస్తే.. అనుమతి ఉన్న ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుంది. మాఫియా ధనార్జనకు క్లెయిం పడుతుందని, అందుకే ఇసుక అత్యవసరం పేరుతో ఏడాది కాలంగా డ్రెడ్జింగ్ విధానాన్ని అడ్డం పెట్టుకుని అడ్డంగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. జిల్లాలో పెన్నానది ప్రారంభం సోమశిల నుంచి చివర ఇందుకూరుపేట వరకు అధికారికంగా రెండు చోట్ల పరిమిత స్థాయిలో అనుమతులిస్తే.. అనధికారికంగా ముప్పై ప్రాంతాల్లో రీచ్‌లు ఏర్పాటు చేసి నదిని కుళ్లబొడిచి ఇసుక అక్రమ రవాణాను రేయింబవళ్లు నిర్విఘ్నంగా సాగిస్తున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు సైతం పర్యావరణ అనుమతులు లేకుండా ఎక్కడా ఇసుక తవ్వకాలు చేయకూడదని స్పష్టం చేసింది. సుప్రీం ఆదేశాల నేపథ్యం తర్వాత కూడా సంబంధిత మైనింగ్, ఇరిగేషన్ శాఖలు, జిల్లా అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొత్త కరకట్టను ధ్వంసం చేసి రోడ్డు నిర్మించిన దృశ్యం

పేరుకే డ్రెడ్జింగ్.. యంత్రాలతో తవ్వకాలు

ప్రజా అవసరాల పేరుతో పర్యావరణానికి తూట్లు పొడుస్తూ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నదిలో కేవలం డ్రెడ్జింగ్ విధానంతోనే ఇసుకను తోడాలని అధికారులు అనుమతులిస్తే టెండర్లలో పొందుపరిచిన నిబంధనలను తుంగలో తొక్కేసి కాంట్రాక్టర్లు పడవలను పక్కన పెట్టేసి భారీ యంత్రాలను నదిలోకి దింపి ఇసుకను తోడేస్తున్నారు. ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు పెన్నా నదిని కుళ్లపొడుస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండతో తమ్ముళ్లు బరితెగిస్తున్నా.. అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సూరాయపాళెం పెన్నానదిలో డ్రెడ్జింగ్ ముసుగులో జరిగే ఈ ఇసుక దందాలో నిత్యం రూ.లక్షల తమ్ముళ్ల జేబుల్లోకి వెళ్తున్నాయి. సూరాయపాళెం రీచ్–2 సంగం బ్యారేజీకు సమీపంలోనే గ్రామానికి వెళ్లే దారిలో ఇష్టానుసారంగా పాత, కొత్త కరకట్టలను ధ్వంసం చేసి నది గర్భంలోకి రోడ్డును నిర్మించారు. కొత్తగా నిర్మించిన కరకట్ట ఉందనే విషయం కూడా తెలియకుండా రోడ్డును నిర్మించడంపై రైతులు మండి పడుతున్నారు. పాత కరకట్టను తెగ్గొట్టి ఇసుక డంపింగ్ యార్డుగా వాడుకోవడం చూస్తే రీచ్ కాంట్రాక్టర్లు ఎంతగా బరితెగించారో తెలుస్తుంది. ఇరిగేషన్ అధికారులకు ఇలాంటి విషయాలు తెలిసినా పట్టించుకోకపోవడంపై రైతులు ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ చేశారంటూ తప్పుడు పోలీస్ కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలను వేధిస్తున్న అధికారులకు టీడీపీ నేతల అక్రమ రవాణా కనిపించడం లేదా? ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ దందా వెలుగులోకి రాకుండా ఏకంగా ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని దాదాగిరి చేయిస్తున్నారు.

జిల్లా మహానాడుకు తమ్ముళ్ల ఝలక్



టీడీపీ జిల్లా మహానాడు నుంచి మధ్యలోనే తమ్ముళ్లు వెళ్లిపోవడంతో ఖాళీ అయిన కుర్చీలు

- గంట వ్యవధిలోనే ఖాళీ అయిన కుర్చీలు
- మొక్కుబడి ప్రసంగాలతో ముగించిన మంత్రులు

నెల్లూరు సిటీ: టీడీపీ నేతలు ఆర్భాటంగా నిర్వహించిన జిల్లా మహానాడుకు తమ్ముళ్లు ఝలక్ ఇచ్చారు. నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జిల్లా మహానాడు నిర్వహించారు. ఇద్దరు మంత్రులతోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలను వాహనాలు ఏర్పాటు చేసి మరీ తరలించారు. అయితే మహానాడు కార్యక్రమం ప్రారంభమైన గంట వ్యవధిలో తమ్ముళ్లు తలోదారి పట్టుకుని వెళ్లిపోవడంతో ప్రారంభంలోనే నిండుగా ఉన్న హాల్ ముప్పాతికపైగా ఖాళీ అయిపోయింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడే సమయానికి ముందు వైపు మూడు, నాలుగు వరుసల్లోనే కార్యకర్తలు మిగిలి ఉన్నారు. వాస్తవానికి వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 5 వేల మంది సీటింగ్ కెపాసిటీ ఉంది. అయితే మహానాడు వాస్తవ పరిస్థితి చూస్తే.. నాలుగు వరుసల్లో కనీసం 200 మంది కూడా లేరని ఈ చిత్రమే చెబుతోంది. వేదిక మీద కూర్చొన్న పార్టీ పెద్దలే ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారు. నియోజకవర్గానికి నాలుగొందల మంది వచ్చినా.. ఎనిమిది నియోజకవర్గాల నుంచి కనీసం 4 వేల మంది అయ్యేవారు. వేదిక ముందు కూర్చొన్న 200 మందిని చూస్తే నాయకుల అనుచరులు తప్ప.. సామాన్య కార్యకర్తలు ఎవరూ అక్కడ కనిపించలేదని స్పష్టమవుతోంది. ఇదే క్షేత్రస్థాయిలో టీడీపీ బలమని పరోక్షంగా రుజువైంది. దీంతో మహానాడు కార్యక్రమంలో ముఖ్యనేతలు ప్రసంగాలను తూతూ మంత్రంగా ముగించారు.

తమ్ముళ్లకు కాసులు.. కూలుతున్న కాపురాలు

ఉదయగిరి నియోజకవర్గంలోని పల్లెలు మద్యం మత్తులో జోగుతున్నాయి. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరలకే ఇస్తామని ప్రచారం చేసిన కూటమి పాలకులు.. ఇప్పుడు ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటు చేసి మందుబాబుల జేబులు ఖాళీ చేస్తున్నారు. పల్లెపల్లెలో.. వీధి వీధికి బెల్టుషాపులు పెట్టి 24x7 తరహాలో మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఇంటి వద్దనే మద్యం అందిస్తున్నామనే నెపంతో అధిక ధరలు వసూలు చేస్తున్నారు.



- ఊరూరా.. వీధివీధిలో విచ్చలవిడిగా బెల్టుషాపులు
- అధిక ధరలకు విక్రయాలు.. మందుబాబుల జేబులకు చిల్లు

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా తమ్ముళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంటే.. కాపురాలు ఆర్థికంగా కుప్పకూలిపోతున్నాయి. గత ప్రభుత్వం మద్యం విక్రయాలను పరిమిత స్థాయిలో చేపట్టితే.. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తోంది. ఒక పక్క సంక్షేమ పథకాలు అటకెక్కాయి. మరో పక్క బతుకుదెరువు పనులు లేకుండా పోయాయి. అదే సమయంలో ఊరికి 2 నుంచి 10 బెల్టుషాపుల ద్వారా టార్గెట్ నిర్దేశించి అమ్మకాలు సాగిస్తోంది. బెల్టు షాపులకు దుకాణాల నిర్వాహకులే నేరుగా సరఫరా చేస్తుండడంతో ప్రతి బాటిల్‌పై రూ.20 వంతున అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో బెల్టు నిర్వాహకులు తమ లాభాల కోసం అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నారు. ఎమ్మార్పీపై రూ.20 దుకాణ యజమానులు వసూలు చేసుకుంటుంటే.. దానిపై మరో రూ.40 నుంచి రూ.50 వరకు బెల్టు షాపుల యజమానులు వసూలు చేస్తున్నారు. దీంతో తక్కువ ధరకు మద్యం అనే ప్రచారం ఉత్తిదే అని స్పష్టమవుతోంది. ఉదయగిరి మండలంలో అయితే 25 పైగా బెల్టు షాపులు ఉన్నాయి.



కొమ్మిలో ఓ మద్యం షాపునకు అనుబంధంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూము

24x7 మద్యం.. రూ.50 అదనం

నియోజకవర్గ వ్యాప్తంగా రాత్రి పగలు తేడా లేకుండా చిన్న పల్లెలో సైతం మద్యం 24 గంటలూ అందుబాటులో ఉంటోంది. బెల్టు షాపుల నిర్వాహకులు ప్రతి బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. విచ్చలవిడిగా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదు. ప్రతి బెల్టు షాపు నుంచి ఎక్సైజ్ అధికారులు నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రతి మద్యం షాపునకు అనుబంధంగా అనుమతులు లేకుండా పర్మిట్ రూములు ఏర్పాటు చేసి మద్యం తాగిస్తున్నారు. పలు మద్యం షాపులు వేళలు పాటించకుండా ఉదయం, రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా మద్యం విక్రయాలు సాగిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్దేశించిన సమయాల్లోనే ప్రభుత్వ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరగ్గా, ప్రస్తుత ప్రభుత్వం మద్యం షాపులు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి గ్రామ గ్రామాల బెల్టు షాపులు ఏర్పాటు చేయించి మద్యాన్ని ఏరులై పారిస్తోంది. దీంతో అనేక పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురికావడం, అనేక ఇళ్లలో మద్యం చిచ్చు రగులుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- కొండాపురం మండలంలో అధికారికంగా 3 మద్యం షాపులు కేటాయిస్తే.. 45 గ్రామాల్లో బెల్టు విక్రయాలు సాగుతున్నాయి. ఇందులో ఇరవై గ్రామాలకు పైగా రెండు నుంచి ఐదు బెల్టు షాపులు ఉండడం గమనార్హం. ఈ మండలంలో మద్యం షాపు నిర్వాహకులే బెల్టు షాపుల నిర్వాహకుల మధ్య పోటీ పెట్టి వారి నుంచి రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు సంవత్సరానికి కప్పం కట్టించుకుంటున్నారు. గ్రామంలో ఒక్క బెల్టు షాపు నిర్వహించుకునేందుకు ఈ సదుపాయం ఏర్పాటు చేశారు.
- జలదంకి మండలంలో 4 దుకాణాలు ఉండగా 35 గ్రామాల్లో బెల్టు షాపులున్నాయి. ఇందులో చామదల, కొత్తపాళెం తదితర ఒక్కొక్క గ్రామంలో 3 నుంచి 5 బెల్టు షాపులు ఉన్నాయి. మద్యం షాపు నిర్వాహకులు తమ సొంత వాహనాల ద్వారా తీసుకెళ్లి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం అదనంగా బెల్టు షాపు ఓనర్ల నుంచి ప్రతి బాటిల్‌పై రూ.20 వసూలు చేస్తున్నారు.
- కలిగిరి మండలంలో 4 మద్యం దుకాణాలు ఉండగా 35 గ్రామాల్లో బెల్టు షాపులున్నాయి. ఇందులో 20 గ్రామాల్లో రెండు కంటే ఎక్కువ బెల్టు షాపులు ఉన్నాయి.
- సీతారామపురంలో 35 గ్రామాల్లో బెల్టు షాపులు ఉన్నాయి. దాదాపు ప్రతి గ్రామంలో 2 లేదా అంతకంటే ఎక్కువ బెల్టు షాపులు ఉండడం గమనార్హం.
- వరికుంటపాడు మండలంలో 40 గ్రామాలకు పైగా బెల్టు షాపుల విక్రయాలు సాగుతున్నాయి. ఒక్క వరికుంటపాడు మండల కేంద్రంలోనే 12 బెల్టు షాపులు ఉన్నాయి. దాదాపు 20 గ్రామాల్లో 2 లేది అంతకంటే ఎక్కువ సంఖ్యలో బెల్టు షాపులున్నాయి.
- వింజమూరు మండలంలో 20 గ్రామాలకు పైగా బెల్టుషాపులున్నాయి. బుక్కాపురం, కిస్తీపురం గ్రామాల్లో బెల్టుషాపులకు వేలం పాటలు నిర్వహించి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దాదాపు పది గ్రామాల్లో ఒక్కొక్క ఊరులో 2 నుంచి 5 బెల్టుషాపులున్నాయి.

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అక్రమ కేసులకు భయపడేది లేదు
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): రాష్ట్రంలో కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ భయపడే ప్రసక్తే లేదని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన కావలి రెండో పట్టణ పోలీసుల విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. విచారణ అనంతరం ప్రతాప్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎప్పుడో ముగిసిన ఫైలాన్ కేసును రీ ఓపెన్ చేసి తనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులపై, గతంలో, ప్రస్తుతం టీడీపీ అరాచకాలను ఎండగడుతున్న జర్నలిస్టులతో కలిసి మొత్తం 13 మందిపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఫైలాన్ కూల్చారని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారనే ఆరోపణలతో అక్రమ కేసులు పెడితే భయపడేది లేదన్నారు. తనను పోలీసులు ఆరు గంటల పాటు విచారించారని, వారు అడిగిన 42 ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. గతంలో జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ కావాలని కోరడంతో ప్రభుత్వ స్థలంలో కట్టించి ఇస్తానని చెప్పానన్నారు. అయితే ఆ సమయంలో అన్నా క్యాంటీన్ మూసివేసి ఉండడంతో అక్కడ ఏర్పాటు చేసుకోవాలని చెప్పానన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే దిశగా ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ వ్యవహరించలేదన్నారు. కుట్ర పూరితంగా కేసును బనాయించారని, దీనికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రజాస్వామ్యాన్ని హరించే దిశగా కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు తెగబడిందన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమ మైనింగ్, మట్టి, ఇసుక, రేషన్ మాఫియాల అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కావలి నియోజకవర్గం ప్రజలకు తాను ఎల్లప్పుడూ విధేయుడినని, వారి ఆశీర్వాదంతో తాను ఎప్పుడూ వారికి సేవ చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

ప్రసన్నకు వైఎస్ జగన్ పరామర్శ

కోవూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతికి ఆపరేషన్ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించినందుకు ప్రసన్నకుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

30న ఈ-వేలం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలో కాలం తీరిన మినీ ట్రక్కును ఈ - వేలం ద్వారా ఈనెల 30వ తేదీన విక్రయిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం ఏపీ ఈ - వేలం పోర్టల్ హెటీటీపీఎస్://కొనుగోలు.ఏపీ.జీఓవీ.ఇన్‌లో చూడాలన్నారు. షరతులు, సవరణలు, పొడిగింపు లాంటి విషయాలన్ని వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేస్తామని తెలియజేశారు.

లైంగిక వేధింపులపై వివాహిత ఫిర్యాదు

- కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): కోర్కె తీర్చకపోతే తనతో తీసుకున్న ఫొటోలను పదిమందికి చూపించి అల్లరి చేస్తానని ఓ వ్యక్తి వివాహితను బెదిరించాడు. అతని వేధింపులు తాళలేని బాధితురాలు భర్త సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కరెంటాఫీస్ సెంటర్ సమీపంలో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. భార్యాభర్తలు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వివాహిత తన సమీప బంధువైన వెంకటేశ్వర్లుతో కుటుంబ విషయాలను చెప్పుకొంటూ సన్నిహితంగా ఉండేది. అతని ప్రవర్తనలో తేడా రావడాన్ని గమనించిన ఆమె దూరంగా ఉండసాగింది. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్వర్లు తన కోర్కె తీర్చాలని లేనిపక్షంలో నిందలు మోపి సమాజంలో తలదించుకునేలా చేస్తానని బెదిరించసాగాడు. వేధింపుల గురించి ఆమె భర్తకు తెలియజేయగా వెంకటేశ్వర్లును మందలించాడు. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 20వ తేదీన వెంకటేశ్వర్లు కోర్కె తీర్చకపోతే గతంలో తనతో తీసుకున్న ఫొటోలను పదిమందికి పంపి అల్లరి చేస్తానని ఆమెను బెదిరించాడు. వివాహిత ఒప్పుకోకపోవడంతో ఫొటోలను బంధువులకు పంపాడు. వేధింపులు తాళలేని వివాహిత తన భర్తతో కలిసి వేదాయపాళెం పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కండలేరులో 42.304 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 42.304 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,250, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్ఎంఈ పార్క్

- మంత్రి పొంగూరు నారాయణ



మహానాడులో పాల్గొన్న నాయకులు

నెల్లూరు సిటీ: కోవూరు షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కాబోతోందని, దీంతో వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం టీడీపీ జిల్లా మహానాడు జరిగింది. నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం భారీగా అప్పు మిగిల్చి వెళ్లిందన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త నాయకులు కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క కార్యకర్త క్రమశిక్షణ పాటించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే..

ఇష్టారాజ్యంగా బైక్ సైలెన్సర్ల మార్పిడి

- రహదారులపై శబ్దకాలుష్యం
- దడ పుట్టిస్తున్న కుర్రకారు
- పర్యావరణానికి తీరని విఘాతం
- వినికిడి వ్యవస్థపై పెను ప్రభావం

వాహనాలపై జనం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో బైక్ దూసుకెళ్తుంది. ఈ దెబ్బకు రోడ్డుపై ఉన్నవారు ఉలిక్కిపడతారు. కొందరు యువకులు తమ ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లను అమర్చుతున్నారు. వీటి ధర ఎక్కువైనా లెక్క చేయడం లేదు. దీని వల్ల ప్రజల కర్ణభేరికి ఇబ్బందికరమని తెలిసినా, పోలీసులు హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. రోడ్డెక్కి తోటి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.




తొలగించిన సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరం వాహనాల రణగొణ ధ్వనులతో హోరెత్తుతోంది. ముఖ్యంగా యువత మోటార్‌బైక్‌లకు ఎక్కువ శబ్దాన్నిచ్చే హారన్లు, సైలెన్సర్లను బిగించుకుని రహదారులపై రయ్ రయ్ అంటూ దూసుకెళ్తున్నారు. చెవులకు చిల్లులు పడేలా శబ్దాలు చేస్తున్నారు. వాయు కాలుష్యంతోపాటు శబ్ద కాలుష్యం తోడవడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ధ్వని 100 డెసిబుల్స్‌కు మించి ఉంటుండటంతో వినికిడి సమస్యలు తలెత్తుతున్నాయి. నగర ట్రాఫిక్‌లో ఓ మనిషి అరగంటపాటు చిక్కుకుని బయటపడేసరికి తీవ్ర తలనొప్పితో బాధపడాల్సి వస్తోంది. గతంలో ప్రజల విజ్ఞప్తితో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని వాహనదారులపై కొరడా ఝళిపించారు. దీంతో కొంతమేర పరిస్థితి గాడిన పడింది. ప్రస్తుతం పట్టించుకునేవారు లేకపోవడంతో పరిస్థితి మొదటికొచ్చింది.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇతరుల వినికిడి శక్తిని దెబ్బతీసేలా ఎక్కువ శబ్దాలు చేసే హారన్లు, సైలెన్సర్లు వినియోగించరాదనే నిబంధనలు జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. అడిగేవారు లేకపోవడంతో కొందరు యువకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వాహనంతో వచ్చిన విడిభాగాలను మాత్రమే వినియోగించాలి. అయితే పలువురు అందుకు విరుద్ధంగా తమ ద్విచక్ర వాహనాలకు తయారీ సంస్థ ఇచ్చిన ప్రామాణిక సైలెన్సర్లు, హారన్లను తొలగించి అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుకుంటున్నారు. ఇందుకోసం రూ.10 వేల నుంచి రూ.20 వేలు అదనంగా వెచ్చిస్తున్నారు. ద్విచక్ర వాహనాల హారన్, సైలెన్సర్ల శబ్దాలతో యువత రోడ్లపై ఇష్టారాజ్యంగా తిరుగుతుండటంతో నగరవాసులు హడలిపోతున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా పెద్ద శబ్దాలు చేస్తూ ట్రిపుల్ రైడింగ్‌లు చేస్తూ నానా హంగామా చేస్తున్నారు. మితిమీరిన శబ్ద కాలుష్యంతో హృద్రోగులు బాధపడుతున్నారు.

చర్యలు చేపట్టాలి

గతంలో ట్రాఫిక్ పోలీసులు శబ్ద కాలుష్యానికి గురిచేసే వాహనాలపై నెలల తరబడి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రూ.లక్షలు విలువ చేసే సైలెన్సర్లు, హారన్లను తొలగించి వాటిని ధ్వంసం చేయడంతోపాటు వాహనదారులపై జరిమానాలు విధించారు. కొన్ని వాహనాలను సైతం సీజ్ చేయడంతో పరిస్థితి కొంతమేర అదుపులోకి వచ్చింది. కాలక్రమేణా పెరిగిన పనిఒత్తిడి, ఇతర కారణాలతో పోలీసుల నజర్ తగ్గింది. కేవలం ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, మైనర్ డ్రైవింగ్‌పై జరిమానాలకే పరిమితమయ్యారు. దీంతో నగరవాసులు శబ్ద కాలుష్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని జనం కోరుతున్నారు. గతంలో శబ్ద కాలుష్యం కలిగించే సైలెన్సర్లు వాడితే రూ.500 జరిమానా విధించేవారు. మోటార్ వాహన చట్ట సవరణలో ఈ మొత్తాన్ని పెంచారు. అందులో భాగంగా తొలిసారి పట్టుబడితే రూ.వెయ్యి, రెండోసారి అయితే రూ.2 వేలు విధించే అవకాశం ఉంది.


నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ (ఫైల్)

జిల్లాలో ఇలా..

2022, 23 సంవత్సరాల్లో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సుమారు వెయ్యికి పైగా సైలెన్సర్లను ధ్వంసం చేశారు. వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఏడాదిగా అడపాదడపా చర్యలతో సరిపెట్టారు.

జిల్లాలో యోగాంధ్ర ప్రారంభం


ఆనంద్, కలెక్టర్

నెల్లూరు రూరల్: వచ్చే నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని అన్ని ప్రధాన పార్కులతోపాటు జిల్లాలోని వివిధ పట్టణాల్లోని పార్కులు, మండల కేంద్రాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఔత్సాహికులు సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ సైతం రూపొందించామన్నారు. అందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు యోగా అవసరాన్ని యువత గుర్తించాలన్నారు. యోగా సాధనకు హాజరై సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 133 లేయర్ చికెన్ : 187
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.50
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15



మండుటెండలో యోగాసనాలు వేసి..

- 26వ రోజుకు చేరుకున్న సీహెచ్‌ఓల సమ్మె


రోడ్డుపై యోగాసనాలు వేసిన సీహెచ్‌ఓలు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోవడంతో జిల్లాలోని సీహెచ్‌ఓలు శుక్రవారం నెల్లూరులోని వైద్యశాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై మండుటెండలో యోగాసనాలు వేసి నిరసన తెలిపారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. వారు చేస్తున్న సమ్మె 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుబేకా మాట్లాడుతూ సీహెచ్‌సీల్లో 95 శాతానికి పైగా మహిళలున్నట్లు చెప్పారు. వారిని రోడ్డుపై నిలబడేలా చేయడం అన్యాయమన్నారు. ఆయుష్మాన్ భారత్‌లోని ఇతర యాప్‌ల్లో తాము పనిచేసిన వివరాలను ఆన్‌లైన్ చేసినా అధికారులు పని చేయలేదన్నట్టు వేధించడం సరికాదన్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే తమకు నిర్దిష్ట జాబ్ చార్ట్ ప్రకటించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాలు పెంచాలని కోరారు. పీఎఫ్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే సమ్మెను ఆపే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ భానుమహేష్, కో-ఆర్డినేటర్ ఆదిల్, మాబ్‌జాన్, హెప్సిబా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేదల విషయంలో ఎందుకు స్పందించలేదు?

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నిర్మల


మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట): 'బర్మాషెల్‌గుంటలో పేదలు ఇళ్లను ఖాళీ చేయాలని చెప్పినప్పుడు నారాయణ స్పందించలేదు. వారు ఎక్కడికి వెళ్తారనే ఆలోచన ఎందుకు చేయలేదు?, వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి పేదలకు కొంత సమయం ఇప్పించారు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల అన్నారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలను ఇళ్ల ఖాళీ చేయించడంలో నారాయణ పెట్టిన శ్రద్ధ పెద్దలు ఆక్రమించిన భూములు స్వాధీనం చేసుకోవడంలో చూపలేదన్నారు. ఇసుక అక్రమ రవాణాను పట్టిస్తే ప్రైజ్‌మనీ ఇస్తానని బహిరంగంగా ప్రకటించారన్నారు. దానికి స్పందించి పట్టించిన నాయకుడికి ఇంతవరకు మీరు ప్రైజ్‌మనీ ఇవ్వలేదన్నారు. ఇసుక వ్యవహారంలో ఎంత దోచుకున్నారో, ఎవరికి ఎంత పంచి పెడుతున్నారో ప్రజలకు తెలియజేయాలన్నారు. దేవస్థాన భూముల కబ్జా చేస్తున్నవారిని అడ్డుకోవాలని టీడీపీ నాయకులే మీడియా ముఖంగా చెబుతున్నా దిక్కులేకుండా పోయిందన్నారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున మీడియాను తీసుకెళ్లి చూపిస్తామన్నారు. మోసపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చే విషయంలో ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. మండలంలోని పంచేడులో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. న్యాయ సమస్యల పరిష్కారం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మహిళల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానికుల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యుడు సుబ్బారెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి, ఎస్సై సంతోష్‌రెడ్డి, ఏపీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

పొదలకూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు గురువారం అర్ధరాత్రి సీజ్ చేశారు. ఎస్సై ఎస్కే హనీఫ్ కథనం మేరకు.. సూరాయపాళెం రీచ్ – 2 నుంచి ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు అడ్డుకుని సీజ్ చేశారు. నిబంధనల ప్రకారం రీచ్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఇసుకను తరలించాలి. అయితే రాత్రివేళల్లో ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. సీజ్ చేసిన లారీని మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారులు, స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి గురువారం రాత్రి నెల్లూరు నగరంలో తనిఖీలు చేపట్టారు. మద్యం షాపులు, బార్లు సమయపాలన కచ్చితంగా పాటిస్తున్నాయా?, అనధికారికంగా విక్రయాలు సాగిస్తున్నారా? తదితర విషయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యాపారులు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. నిర్ణీత వేళల్లోనే విక్రయాలు సాగించాలని, అనధికార విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీ దయాసాగర్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ ఎస్.మధు, ఏఈఎస్ జగదీష్, ఇన్‌స్పెక్టర్లు బాలనరసింహులు, వై.వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో టీటీడీ ఈఓ తనిఖీలు

తిరుమల: తిరుమలలోని పలు ప్రాంతాలను టీటీడీ ఈఓ శ్యామలారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిలా తోరణం, చక్ర తీర్థంలో చక్రత్తాళ్వార్, నరసింహస్వామి, ఆంజనేయస్వామి ప్రతిమలతోపాటు ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రత, పార్కింగ్‌ను పరిశీలించారు. పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈఓ సోమన్ నారాయణ, ఆరోగ్య అధికారి డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

అదనపు ఈఓ పరిశీలన

తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి శుక్రవారం వేకువజామున క్యూలను తనిఖీ చేశారు.కృష్ణతేజ విశ్రాంతి భవనం వద్ద శ్రీవారి సేవకులు పంపిణీ చేస్తున్న అన్న ప్రసాదం. పాలు, తాగునీరు, టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

'ఏసీ' ఉత్తిదేనా..!



ఇటీవల నెల్లూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ అధికారులు ఏసీ బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. వీటి విషయంలో అధికార పార్టీ నాయకులు హంగామా చేశారు. అయితే నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఏసీ పనిచేయకపోవడంతో తలుపు తీసి విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధులు.

ఇక్కడే బాగుంది



నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్.. నిత్యం ఇక్కడి నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ బస్టాండ్‌లో కుక్కలు అధికంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కుర్చీల వద్దే తిష్ట వేసి ఉండటంతో కుర్చుకునేందుకు చిన్నారులు, మహిళలు జంకుతున్న పరిస్థితులున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

దుగరాజపట్నం నౌకా నిర్మాణం వద్దు

- అమరావతి నిర్మాణం సక్సెస్ కాదు
- రాజధాని విషయంలో చంద్రబాబు తప్పు చేస్తున్నారు
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గూడూరు రూరల్: వాకాడు సముద్ర తీరప్రాంతంలోని దుగరాజపట్నం వద్ద నౌకా నిర్మాణం వద్దని, మేజర్ పోర్టు నిర్మించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే 5వ అతిపెద్ద దుగరాజపట్నం మేజర్ పోర్టును ఆనాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం దాన్ని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రద్దు చేసి నౌకల నిర్మాణ కేంద్రం నిర్మించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. దుగరాజపట్నం పోర్టు పూర్తయితే వందల సంఖ్యలో పరిశ్రమలు రావడంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. రాజధాని విషయంలో చంద్రబాబు తప్పు చేస్తున్నారని దుయ్యబట్టారు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో రూ.లక్ష కోట్లతో రాజధాని నిర్మిస్తున్నారని తెలిపారు. సెక్రటేరియట్ కోసం 50 అంతస్తుల భవనాన్ని కట్టాలనుకుంటున్నారని, భవిష్యత్తులో అది కూలిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. శివరామకృష్ణన్ కమిటీ అమరావతిలో రాజధాని నిర్మించాలని చెప్పలేదన్నారు. 2029 నాటికి పేదరికాన్ని పారదోలుతానని చంద్రబాబు అంటున్నాడని, 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, చందన మూడి శివ, పెంచలయ్య, పూల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.